## క్లుప్తంగా...

### ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



**చిలకలగూడ:** పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని కార్పొరేటర్ హేమ పేర్కొన్నారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ మోడల్ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయాలతో విజ్ఞానదాయకమైన సమాజం సాధ్యపడుతుందన్నారు. పుస్తక పఠనంలో ఉన్న తృప్తి ఇంటర్నెట్ సెర్చింగ్‌లో ఉండదన్నారు. కంప్యూటర్ యుగంలో కూడా గ్రంథాలయాల ప్రత్యేకత కొనసాగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

### మహిళాభ్యున్నతికి కృషి చేయాలి

**రసూల్‌పురా:** కంటోన్మెంట్ మహిళా వికాస్ సంఘ్ సభ్యులు రాష్ట్ర మహిళా భద్రతా విభాగం డీఐజీ బి. సుమతిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళల అభివృద్ధికి సాధికారతకు ఏర్పాటు చేసిన మహిళా వికాస్ సంఘ్‌కు షీ–టీమ్స్ తరఫున పూర్తి సహకారం ఉంటుందని సుమతి హామీ ఇచ్చారు. మహిళా వికాస్ సంఘ్ నిస్వార్థంగా మహిళల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదరికంలో ఉంటూ ఏ పని చేయాలో తెలియక, ఎలాంటి ఆసరా లేక ఒంటరిగా ఉంటున్న ఆడవాళ్లు, భర్తను కోల్పోయి కుటుంబాన్ని పోషించే వాళ్లు తదితర మహిళల సంక్షేమం కోసం మహిళా వికాస్ సంఘ్ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా వికాస్ సంఘ్ సభ్యులు మంజుల, రేఖ, శైలజ, భాగ్య పాల్గొన్నారు.

### నిజాం కళాశాలలో నూతనంగా బీబీఏ రిటైల్ ఆపరేషన్స్ కోర్సు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న లక్ష్మీనారాయణ, వాకాటి కరుణ

**లాలాపేట:** నిజాం కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి కొత్తగా బీబీఏ రిటైల్ ఆపరేషన్ కోర్సును ప్రవేశపెట్టడం కోసం రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, కమిషనర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ తెంగాణ స్టేట్, ఉస్మానియా యూనివర్సిటీల మధ్య త్రైపాక్షిక అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం నిజాం కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి కరుణా వాకాటి, చైర్మన్ ప్రొ. లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొ. మహమూద్, ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు వారంలో మూడు రోజులు షాపింగ్ మాల్స్, రిటైల్ మార్కెట్లకు వెళ్తారు. రిటైలర్స్ అసోయేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా విద్యార్థులకు షాపింగ్ మాల్స్‌లో అప్రెంటీస్ షిప్ ప్రోగ్రామ్‌లు, సంబంధిత పాఠ్యాంశాలను అభివృద్ధిచేయడం, ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లు, గెస్ట్ లెక్చర్లను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల ప్రిన్సిపాల్ బి. భీమా, డా. యాదగిరి, బీబీఏ కోర్సు కోఆర్డినేటర్ డా. తిరుపతి పాల్గొన్నారు.

### పాత కక్షలతో దాడి

ఒకరికి గాయాలు

**అడ్డగుట్ట:** పాత గొడవను మనసులో పెట్టుకొని రెండు గ్రూపుల మధ్య జరిగిన గొడవలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన తుకారం గేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అంజనేయులు వివరాల ప్రకారం.. గత నెల తుకారంగేట్‌కు చెందిన బిట్టు అనే యువకుడి జన్మదిన వేడుకలు అడ్డగుట్టలో జరిగాయి. ఈ క్రమంలో పుట్టిన రోజు వేడుకలకు వచ్చిన రెండు గ్రూపుల మధ్య గొడవ జరిగింది. అది మనసులో పెట్టుకొని శనివారం అడ్డగుట్టలోని గడ్డమీద బస్తీలో ఈ రెండు గ్రూపుల మధ్య మరోసారి గొడవ జరగగా తుకారంగేట్‌కు చెందిన సాయి(23)పై అరుణ్ కార్తీక్ (24) రేడియం కటింగ్ బ్లేడ్‌తో దాడి చేయగా సాయి మెడ, మోచేతికి గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు అరుణ్ కార్తీక్, అభిషేక్, మెట్టుగూడ భాగ్యరాజు, తీగల భాగ్యరాజు, లల్లా, సత్యలను అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు.



దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ శనివారం సికింద్రాబాద్ డివిజనల్ డిపోను సందర్శించి అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునర్ అభివృద్ధి పనులపై ఆరా తీశారు. – సాక్షి, సిటీబ్యూరో

# కట్టమైసమ్మ జాతరకు సర్వం సిద్ధం

- నేడు బోనాలు.. రేపు రంగం
- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు



**చిలకలగూడ:** చిలకలగూడ బోనాల జాతర వేడుకలకు సర్వం సిద్ధమైంది. పుష్పాలు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు. సుమారు లక్ష మంది భక్తులు వేడుకల్లో పాల్గొంటారని అంచనా. శనివారం అర్ధరాత్రి కానుగుల వంశీయుల సమర్పించిన మైలబోనంతో జాతర సందడి మొదలైంది. బోనంతో వచ్చేవారికి, మహిళలకు ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్ తెలిపారు. ఆలయం ఎదురుగా మున్సిపల్ మైదానంలో జాయింట్‌వీల్, కొలంబస్ వంటి ఆటపాటలతో ఫన్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం బోనాలు, ఫలహారం బండ్లు, తొట్టెల ఊరేగింపు, సోమవారం సాయంత్రం భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమం జరుగుతుంది. డిప్యూటీ స్పీకర్ పద్మారావు దంపతులు ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు అమ్మవారిని దర్శించుకుంటారు.

#### ఏర్పాట్లపై డిప్యూటీ స్పీకర్ సమీక్ష

- చిలకలగూడ బోనాల జాతర ఏర్పాట్లపై డిప్యూటీ స్పీకర్ పద్మారావు సంబంధిత అధికారులు, ఆలయ నిర్వాహకులతో కలిసి సమీక్షించారు. జీహెచ్ఎంసీ,అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొబైల్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మంచినీళ్ల ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా వాహనాల డైవర్షన్ చేపట్టాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, చిలకలగూడ ఏసీపీ శ్రీనివాస్‌ల ఆదేశాల మేరకు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని సీఐ మట్టంరాజు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పద్మారావు, కార్పొరేటర్ హేమ, ఈఓ మహేందర్‌గౌడ్

## నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తా

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సనత్‌నగర్:** నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు పెట్టేందుకు వెనుకాడేది లేదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టలో రూ.93 లక్షలతో వీడీసీసీ రోడ్డు, బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్ పాటిగడ్డలో రూ.12.40 లక్షలతో వీడీసీసీ రోడ్డు, ఎయిర్‌లైన్స్ కాలనీలో రూ.14 లక్షలతో చేపట్టనున్న ఫుట్‌పాత్ పనులను శనివారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గతంలో నల్లకుంట ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రహదారులు మొత్తం మురికిమయంగా ఉండేవని, ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు తేడా లేకుండా సీవరేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించామన్నారు. నూతనంగా నిర్మించే వీడీసీసీ రోడ్లతో ఈ ప్రాంతంలోని సమస్యలు దాదాపుగా పరిష్కారమైనట్లే అన్నారు. తమ బస్తీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు మంత్రిని కోరగా త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓల్డ్‌పాటిగడ్డలో మల్టీపర్పస్ హాల్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలే నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, కార్పొరేటర్లు మహేశ్వరిశ్రీహరి, సుచిత్ర, మాజీ కార్పొరేటర్ తరుణి, డీఎంసీ ముకుందరెడ్డి, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, ఈఈ సుదర్శన్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ సర్జరీలో అధునాతన మార్పులు



అంతర్జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న గాంధీ వైద్యులు

**గాంధీఆస్పత్రి:** అంతర్జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని గాంధీ ఆస్పత్రిలో శనివారం ఘనంగా నిర్వహించారు. మెడికల్ కాలేజీ ప్రాంగణాల్లో చైతన్య ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ సర్జరీలో అధునాతన మార్పులు చోటు చేసుకున్నాయని, ఆధునిక పద్ధతులు, వైద్య యంత్రాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గాంధీ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి ప్రొఫెసర్ సుబోధ్‌కుమార్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, హెచ్ఓడీలు ఎస్‌వీఎస్ రెడ్డి, రవిశేఖర్, వైద్యులు బలరామ్, మహేందర్, అనిత, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## 'డబుల్' ఇళ్ల అవినీతిపై ప్రజలకు వివరిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌సుందర్

**చిలకలగూడ:** 'డబుల్' ఇళ్ల అవినీతిపై ఇంటింట ప్రచారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ అన్నారు. నామాలగుండు బీఎస్ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్‌లో పదివేల ఇళ్లు నిర్మిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో గొప్పలు చెప్పుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేవలం 419 ఇళ్లు మాత్రమే నిర్మించారన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇవ్వకుండా బీఆర్ఎస్ నాయకులకే కేటాయించారని, నిలదీస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అన్ని డివిజన్లలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి నేరుగా జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు వెంకటరమణి, కార్యవర్గ సభ్యులు బండపల్లి సతీష్, రవిప్రసాద్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, నాయకులు హరి, రాచమల్ల కృష్ణమూర్తి, శారద, ప్రకాశ్, వేణు, గణేష్ పాల్గొన్నారు.

### ఫీజుల పెంపు, కోర్సుల రద్దుతో ఉన్నత విద్య దూరం

**లాలాపేట:** ఓయూలో ఫీజుల పెంపు, కోర్సుల రద్దుతో పేద ప్రజలకు ఉన్నత విద్యను దూరం చేసే పరిస్థితులు నెలకొంటున్నాయని ఓయూ పరిశోధక విద్యార్థులు ఆరోపించారు. శనివారం ఓయూలోని ప్రధాన లైబ్రరీ వద్ద సేవ్ ఓయూ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇటీవల పీహెచ్‌డీ కోర్సు ఫీజును అమాంతం పెంచేశారని, ఇంటిగ్రేటెడ్ కోర్సును రద్దు వంటి సంఘటనలే నిదర్శనం అన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాలను భర్తీ చేయకుండా ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు.

### రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

**చిలకలగూడ :** గుర్తు తెలియని ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సికింద్రాబాద్ రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ నెల 14న అర్ధరాత్రి దయానంద్ నగర్ రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని యువకుడు రైలు కింది పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

### యువతికి లైంగిక వేధింపులు

వ్యక్తిపై కేసు నమోదు

**అమీర్‌పేట:** యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ఓ ప్రబుద్ధుడిపై కేసు నమోదైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. బీకేగూడ దాసారం బస్తీకి చెందిన 50 ఏళ్ల మహిళను భర్త వదిలేసి వెళ్లగా తన 19 ఏళ్ల కూతురు మరో కుమారుడితో కలిసి ఉంటోంది. సదరు మహిళ అనారోగ్యానికి గురవడంతో ఆమె కూతురు కాల్‌సెంటర్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. నాలుగేళ్ల క్రితం తల్లిని ఈఎస్ఐ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆ సమయంలో నాగరాజు(57) పరిచయమై సహాయం చేసినట్లు నటించాడు.ఆస్పత్రికి వెళ్లిన ప్రతిసారి తల్లిని ఇంటి వద్ద దింపి వెళ్లేవాడు.తన భార్య తనను వదిలి పెట్టి వెళ్లడంతో ఒంటరిగానే ఉంటున్నానని నమ్మించి వారితోనే కలిసి ఉంటున్నాడు. ఇటీవల తల్లి ఇంట్లో లేని సమయంలో ఆమె కూతురిని అసభ్యకరమైన చేష్టలతో లైంగికంగా వేధించడం ప్రారంభించాడు. తన కోరిక తీర్చాలని ఇబ్బంది పెడుతుండటంతో తల్లికి విషయం చెప్పింది. ఇద్దరు కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### చిలకలగూడ ఏసీపీగా జైపాల్ రెడ్డి



**బౌద్ధనగర్:** చిలకలగూడ నూతన ఏసీపీగా జైపాల్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1995 బ్యాచ్‌కు చెందిన ఏసీపీ జైపాల్ రెడ్డి ఇది వరకు సీసీఎస్‌లో విధులు నిర్వహించారు. చిలకలగూడ ఇన్‌చార్జి ఏసీపీ శ్రీనివాస్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో జైపాల్ రెడ్డిని నియమించారు.



వెస్ట్ మారేడుపల్లిలోని నారాయణ పాఠశాలలో శనివారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో బోనాలతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పురుషోత్తం రెడ్డి, ప్రిన్సిపల్ నాగలక్ష్మి, ప్రైమరీ వైస్ ప్రిన్సిపల్ మనీషా, కిడ్స్ వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి పాల్గొన్నారు. – సాక్షి, సిటీబ్యూరో




## కార్మికులకు ఈఎస్ఐ భద్రత కల్పించాలి



**బౌద్ధనగర్:** కార్మికులందరికీ ఈఎస్ఐ భద్రత కల్పించాలని మాంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ వల్లల మంజూలా డిమాండ్ చేశారు. మాంట్ ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్, వర్కింగ్ పీపుల్స్ కోయలిషన్ సంయుక్తాధ్వర్యంలో బౌద్ధనగర్‌లోని పార్కు వద్ద నిర్వహించిన పోస్ట్‌కార్డ్ క్యాంపెయిన్‌లో మంజూలా మాట్లాడారు. పెరుగుతున్న వైద్య ధరలను బట్టి కార్మికులకు మెరుగైన వైద్యం లభించాలంటే నానా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈఎస్ఐ ద్వారా మెరుగైన వైద్యం ఖర్చు లేకుండా పొందే అవకాశం కార్మికులకు దొరుకుతుందని వివిధ కార్మిక సంఘాలు దేశంలో ఏకమై పోరాడుతున్నాయన్నారు. ఈ సవాళ్లను పరిష్కరించే దిశగా పనిచేస్తున్న కార్మికులందరికీ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్(ఈఎస్ఐ) వర్తించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జువేరియా, మెహరజున్నీసా, తయబ్బ బేగం, నందిత, పాల్గొన్నారు.

## రైలులో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి రిమాండ్



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న పోలీసులు

**చిలకలగూడ:** రైలులో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆర్‌పీఎఫ్ డీఎస్‌పీ నరసయ్య వివరాల ప్రకారం.. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ముంబాయికి గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం అందుకున్న ఇన్‌చార్జి అడిషనల్ డీజీపీ కమలాసన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 14న 10వ ప్లాట్‌ఫాంకు చేరుకున్న కోణార్క్ రైలులో తనిఖీలు నిర్వహించారు. ఎస్–6 బోగిలో సీటు కింద బ్యాగుల్లో దాచిన 35 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఒడిశా గజపతి జిల్లా మోహన గ్రామానికి చెందిన అలెన్‌బీర్ (24)గా గుర్తించి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి స్వాధీనం చేసుకోవడంలో చురుకుగా వ్యవహరించిన శ్రీను, మజీద్, ప్రజ్ఞ, వీరబాబు, మునీశ్వర్, సుఖ్‌దేవ్, హరిలాల్, భవానీశంకర్, వెంకటరెడ్డి, శ్యామ్‌సుందర్, శివప్రసాద్, మనోజ్‌కుమార్, సుర్జిత్‌ను రైల్వే పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

#### ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

**బౌద్ధనగర్:** గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వారాసిగూడకు చెందిన అత్తాపురం గిరిధర్(23), పర్వత్ సాయితేజ్(24) వీరిదరూ కలిసి వైజాగ్‌కు చెందిన రాజు, అంబర్‌నగర్‌కు చెందిన గడ్డం సాయిలతో కలిసి గంజాయి విక్రయాలకు పాల్పడుతుంటారు. శనివారం అంబర్‌నగర్‌లోని కట్టవద్ద నలుగురు తేజా, వంశీ, తబ్రేజ్‌కు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు గిరిధర్, సాయితేజ్‌ను పట్టుకుని వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజు, గడ్డం సాయి, తేజా, వంశి, తబ్రేజ్ పరారైనట్లు పోలీసులు తెలిపారు.




సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379